

# పువ్వొకటి తుమ్మెదలు రెండు

తిరుమలశ్రీ

పోరగాళ్లకు వీడ్కోలు చెప్పి లేడి కూనలా ఛంగున గెంతుతూ ఇంట్లోకి నడిచింది చంపక.

సావిట్లో చమురుదీపాలు శక్తిమేరకు కాంతులీనుతున్నాయి.

తండ్రి పర్వతాలు ఎలుగుబంటి చర్మంపైన కూర్చుని ధూమపాన గొట్టాన్ని దట్టిస్తున్నాడు.

"శుభరాత్రి, బాబా!" అంటూ తండ్రిని పలకరించింది చంపక.

"శుభరాత్రి, బిడ్డా!" అని జవాబు యిచ్చాడు పర్వతాలు.

ఏదో కూనిరాగం తీస్తూ గదివైపు నడిచింది చంపక.

అంతలోనే, "బిడ్డా!" అన్న పిలుపుతో గది గుమ్మందగ్గరే ఆగిపోయింది. అక్కడినుండే వెనక్కు తిరిగి, "ఏం బాబా?" అందామె.

చేరువకు రమ్మని సైగచేసాడతను. అడుగులో అడుగు వేసుకుంటూ తండ్రిని సమీపించింది. చక్రాలవంటి కళ్లతో ప్రశ్నార్థకంగా చూసింది.

"ఇంద్రుడు, సెంద్రుడు ఇండ్లకు పోయిన్రా బిడ్డా?" ప్రశ్నించాడు పర్వతాలు.

తల ఆడించింది.

"సూడు బిడ్డా! ఈ ఎవహారం ఇలా పొడిగించడం లెస్సగా లేదు బిడ్డా! తొరలోనే ఓ నిర్నయానికి రావాలి మరి" అన్నాడతను.

తండ్రి ఏ విషయం మాట్లాడుతున్నాడో ఆమెకు ఎరుకే. అయినా ఎరగనట్టు "ఏ విషయం బాబా?" అంది అమాయకంగా ముఖం పెట్టి.

"ఇంద్రుడు, సెంద్రుడుల గురించే బిడ్డా నేను సెప్పేది. ఇంకా జాగు సేయకుండానే వారిలో ఒకరిని వరించడం లెస్సంటున్నాను" అన్నాడు పర్వతాలు.

చంపక లజ్జావనిత వదనయై తల దించుకుంది.

కూతురివంక ముచ్చటగా చూస్తూ అన్నాడు అతను— "ఇలా లజ్జ చెందితే ఎలా బిడ్డా? మీ అమ్మే వుంటే నాకీ సమస్యే వుండేది కాదు. నాకా ఇలాంటి సంగతులు ఎలా అడగాలో తెలియదాయె!"

మోము ఎత్తి తండ్రివంక ఆరాధనగా చూసింది చంపక. "అమ్మను ఎరక్కపోయినా ఆ తలంపు రాకుండా అంతకంటే మిన్నగా పెంచితివి నన్ను. నా మనసు నీకు కాక ఇంకెవరికి చెప్పుకుంటాను బాబా? ఇంకా ఏ నిర్ణయమూ చేసుకోలేదంతే!" అంది.

"సిగ్గుతో దాస్తుండవేమోనని అడిగితిని బిడ్డా! తొందరలోనే నిన్ను నీకు నచ్చిన పోరగాడి చేతుల్లో పెడితే నాకు తృప్తి!" అన్నాడతను.

"నన్ను తొందరగా వొదిలించుకోవాలని నీకెందుకు బాబా ఆరాటం?" అందామె కొంటెగా.

"ఎంత పలుకాడితివి బిడ్డా! నిన్నిడిసి నే నుండగలనా? అయినా తప్పదు గదా! ఏ ఈడులో జరగవలసిన ముచ్చట ఆ ఈడులో జరపడం ఆచారంగా బిడ్డా!" అన్నాడతను, గొంతులో కించిత్తు బాధ ధ్వనిస్తూంటే.

"మన్నించు బాబా! వూరికే అన్నానంతే. ఆ మాత్రానికే నువ్వింత బాధ పడతావని వూహించలేదు" అందామె నొచ్చుకుంటూ.

"ఆడబిడ్డను కన్న ప్రతి అమ్మకు, అయ్యకు ఈ బాధ తప్పదు బిడ్డా!.... వెళ్లి వుడుపులు మార్చుకుని రా, భోంచేద్దాం" అని అతననడంతో, అచ్చటి నుండి కదిలింది చంపక.

## 2

ఆధునిక నాగరికతకు దూరంగావున్న ఒకానొక గిరిజన గూడెం అది. ప్రకృతి వొడిలో తలదాచుకుంటూన్న ఆ



యువ

అమాయకపు గిరిజనులు ప్రకృతి కాంత ముద్దుబిడ్డలు.

ఆ గూడెపు నాయకుల్లో పర్వతాలు ఒకడు. మనిషి ఎంత మోటుగా, మాట కరుకుగా వుంటాడో, మనసు అంత సున్నితం.

పదేళ్ల చంపకను విడిచి భార్య కన్నుమూయడంతో మారు మనువాడకుండా అమ్మా, అయ్యా తానే అయి అల్లారుముద్దుగా పెంచుకొచ్చాడు బిడ్డను. అందాల ప్రౌఢగా తయారయిన చంపక, గూడెంలోని యువకుల గుండెల్లో గుబులు రేపేది. పసిడి ఛాయలో సన్నగా, ఎత్తుగా సౌందర్యమంతా పుణికిపుచ్చుకున్న చంపక నేర్వని విద్యంటూ లేదు. రాని పనంటూ లేదు. ఇల్లు వూడ్చి ముగ్గులు వేయడం మొదలుకుని, విల్లంబులు పట్టి దుష్టమృగాలను వేటాడడం వరకు అంతా క్షుణ్ణంగా నేర్చుకుంది. మయూరిలా చక్కగా నృత్యం చేస్తుంది. అందచందాలకు తోడు సంస్కారం సంతరించుకుని పెరిగిన చంపక సాటి కన్యలలో అసూయను, వయసు కుర్రాళ్లలో ఆరాధనను కలిగించడంలో అతిశయం లేదు.

చంపక చిన్ననాటి నేస్తాలు ఇంద్రుడు, చంద్రుడూను. ఇంద్రుడు ఓ చిన్న నాయకుడి కొడుకైతే, చంద్రుడు ఓ సామాన్యుడి బిడ్డ. చంపక, చంద్రుడి చెల్లెలు పద్మ, చంద్రుడు, ఇంద్రుడు చిన్ననాటినుండీ కలిసిమెలిసి పెరిగారు. దొంగాటలు, దోబూచులు, కోతికొమ్మచ్చులు ఆడేవారు. చెట్లెక్కి పళ్లు కోసేవారు. బాణాలతో ఎగిరే పిట్టలను కొట్టేవారు. ఏటిలో ఈత కొట్టేవారు. చేపలు పట్టేవారు. గంటల తరబడి తోటలో కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు. చిలిపి కజ్జాలు పెట్టుకుని, మళ్లీ వెంటనే కలిసిపోయేవారు. చంపకను కాని, పద్మను కాని ఇతర పోరగాళ్లు ఏమైనా అంటే ఇంద్రుడు, చంద్రుడు కలిసి వాళ్లను వుతికేసేవారు. దాంతో ఆ పిల్లల జోలికి రావడానికి భయపడేవారంతా. వూహ తెలిసినప్పటినుండీ నలుగురూ ఒకటిగా పెరిగారు. తల్లిదండ్రుల మద్దత్తు లభించడంతో వారిని అభ్యంతర పెట్టేవారు లేకపోయారు... పద్మకు పెళ్లయిపోవడంతో ఇప్పుడు ముగ్గురే అయ్యారు.

ఏ విషయంలోనూ ఇంద్రుడు, చంద్రుడు ఒకరికొకరు తీసిపోరు. సకల విద్యలలోను, సంస్కారంలోను ఇద్దరూ సమవుజ్జీలే. అందుకే వారంటే చంపకకు మక్కువ, ప్రాణమూను. ఆమె హృదయంలో ఇద్దరికీ సమాన స్థానముంది. అలాగే ఆ యువకులిద్దరికీ కూడా చంపక అంటే పంచప్రాణాలు. చిన్నప్పటినుండీ ఆమెపైన ఈగ వాలనివ్వరెవ్వరూ.... మిత్రులిద్దరికీ ఒకరిపై వొకరికి ఎనలేని ప్రేమాభిమానాలు. వయసుపోసుకున్న వారి స్నేహలత

పటిష్టమై ప్రేమలతగా రూపొంది పుష్పించడంలో ఆశ్చర్యంలేదు.

చంపక ఆ ఇద్దరిలో ఎవరిని వరిస్తుందోనన్న వుత్కంఠ గూడెంలో చోటుచేసుకుంది. కూతురికి పూర్తి స్వేచ్ఛనిచ్చిన పర్వతాలు ఆ నిర్ణయాన్ని ఆమెకే వదిలేసాడు. త్వరలో ఆమె తన నిర్ణయాన్ని తెలిపితే వివాహం జరిపించాలని ఆత్రుత చెందుతున్నాడతను.

అయితే – ఇద్దరిలో ఎవరిని నిర్ణయించుకోవాలో తెలియక తికమక పడింది చంపక. ఎందులోనూ ఒకరికొకరు తీసిపోరు.

చంద్రుడు– ప్రశాంతంగా సాగే గంభీర నదీజలమైతే.... ఇంద్రుడు– పురవళ్లు పరవళ్లతో దుడుకుగా పరువులెత్తే సెలయేరు.

ఇద్దరినీ సమంగా ప్రేమిస్తోంది తాను. ఎవరిని ఎన్నుకుంటుంది? ఎవరిని వదులుకుంటుంది? ఒకరిని వరిస్తే మరొకరు బాధపడతారన్న భీతి వుంది.

ఇద్దరినీ విడిచి వుండలేదు తాను. అలాగని ఇద్దరినీ మనువాడనూ లేదు.

ఎటూ నిర్ణయించుకోలేని సంధిగ్ధావస్థ. ఎక్కువకాలం ఆ విషయాన్ని వాయిదా వేయడం సాధ్యంకాదని చంపక ఎరుగును. తొందరలోనే ఏ మాటా తండ్రికి చెప్పక తప్పదు.

ఇంద్రుడు, చంద్రుడు ప్రాణ మిత్రులు. ఒకరికోసం మరొకరు ప్రాణాలు ఇస్తారు. 'తనను ఎవరు మనువాడేదీ వారినే నిర్ణయించుకోమంటే–?' అన్న యోచన కలిగింది చంపకకు. కాని, అంతకంటే క్రూరత్వం మరొకటి వుండదనిపించింది.

తప్పదు! తర్వలోనే ఏదో ఒక నిర్ణయానికి రాక తప్పదు. ఇద్దరిలో ఒకరికి మనస్తాపం కలిగించక తప్పదు!

ఆలోచించేకొద్దీ చంపక మనసంతా భారంగా అయిపోయింది.

'ఎందుకొచ్చిన పెళ్లి! అంతకంటె ముగ్గురమూ మనువాడకుండా జీవితాంతం అలా ప్రాణమిత్రులుగా కలిసి వుండిపోతే ఎంత బావుణ్ణు!' అనుకుంది నిట్టూర్చుతూ.

* * *

"బాబా! ఇంద్రుడు, చంద్రుడులలో నీ ఇష్టమొచ్చిన వాణ్ణి నిర్ణయించు బాబా!" అన్న కూతురి వంక విస్మయంతో చూసాడు పర్వతాలు. అంతలోనే ఆనందం కలిగిందతనికి – కూతురు తన పెద్దరికాన్ని నిలిపినందుకు.

"బహు లెస్స, బిడ్డా!" అంటూ మెచ్చుకున్నాడు.

పర్వతాలు నిర్ణయం చంద్రుణ్ణి క్రుంగదీసింది. ఇంద్రుణ్ణి ఐరావతం ఎక్కించింది.

చంపక హృదయం బాధతో మూలిగింది. తన ముఖం చంద్రుడికి చూపలేక మధనపడిందామె. మనసులో బాధగా



వున్నా - చంపక, ఇంద్రుడు తన ప్రాణాలు కావడంతో ఆనందంగా కూడా వుంది చంద్రుడికి. వారి మధ్య అడ్డు రాకూడదన్నట్టు సాధ్యమయినంత మటుకు వారిని తప్పించుకు తిరగసాగాడు.

### 3

ఆ రోజు వుదయం ఇరుగు, పొరుగు స్త్రీలతో కలిసి నీటికోసం ఏటికెళ్లింది చంపక. కబుర్లు చెప్పుకుంటూ తిరిగి వస్తూంటే ఎక్కడినుండి వచ్చిందో హఠాత్తుగా ఆబోతు ఒకటి పెద్దగా రంకె వేస్తూ లగెత్తుకొచ్చింది వారి వైపు. భీతితో యువతులంతా చెల్లాచెదురయి పోయారు. చంపక మాత్రం ఎటూ కాళ్లాడక నిర్ఘాంతపోయి నిలుచుండి పోయింది.

ఆబోతు మీదకు దూసుకొస్తూంటే భయంతో కెవ్వున అరిచి చంకలోని కూజాబిందెను జారవిడిచేసి గట్టిగా కళ్లు మూసుకుంది.

అదే సమయంలో - అటు వెళుతూన్న చంద్రుడి కంటపడింది ఆ దృశ్యం. మెరుపులా అటువైపు పరుగెత్తాడు.

చంపక పైకి వురకబోతూన్న ఆబోతు, ఆ పిల్లకూ తనకూ మధ్య అడ్డు నిలిచిన చంద్రుణ్ణి చూసి ఆగ్రహావేశాలతో గట్టిగా గర్జించి మీదకు దుమికింది. దాని తల పట్టుకుని ఆపబోయాడు చంద్రుడు. కాని, అది వచ్చిన విసురుకు పట్టుదొరకలేదు. ఆబోతు పొడిచిన పోటుకు ఎగిరి దూరంగా పడిపోయాడతను. లేచి నిలుచుంటూన్న చంద్రుణ్ణి మళ్లీ ఢీకొంది ఆబోతు. మరోసారి ఎగిరి పడ్డాడతను.

చంపక కెవ్వుమంది. యువతులంతా హాహాకారాలు చేసారు.

అంతలో ఎవరో కర్రలతో అరుస్తూ రావడంతో ఆబోతు పారిపోయింది.

చంద్రుడు పైకి లేవలేకపోయాడు. మనుషులొచ్చి సాయంచేసినా లేచి నిలుచోలేకపోయాడు.

అతని ఎడమ కాలు విరిగింది!

* * *

చంపకను కాపాడేందుకని ఆబోతుతో తలపడి కాలు విరగొట్టుకున్నాడు చంద్రుడు.

చంపక మనసంతా దేవినట్లయింది. ఏ వ్యక్తినైతే వద్దనుకుందో, ఆ వ్యక్తి తన ప్రాణాలకు తెగించి తనను కాపాడాడు! కాలు విరగొట్టుకున్నా...! విపరీతమైన జాలి, అభిమానమూ పుట్టుకొచ్చాయి ఆమెకు. నిశ్శబ్దంగా రోదించింది.

చంద్రుడు దేహంతోపాటు చంపక హృదయం కూడా తీవ్రఘాతానికి గురి అయింది. చంద్రుడికి నయమయేంతవరకు నిద్రాహారాలను నిర్లక్ష్యంచేసి అహర్నిశలూ అతని దగ్గరే వుండి శ్రద్ధతో శుశ్రూష చేసింది.

అవిటివాడయినందుకు అతను వాపోతూంటే వోదార్చేది.

మిత్రుడికి పట్టిన దుస్థితికి ఇంద్రుడు మిక్కిలి విచారించాడు. తరుచు వచ్చి చంద్రుడితో ఎక్కువ సమయం గడుపుతూ ధైర్యం చెబుతూండేవాడు. మిత్రుడి కష్టాన్ని మరిపించాలనీ, అతనిలో పేరొన్న నిరాశను పారద్రోలి ఆశాపూరితుణ్ణి చేయాలనీ తమ శాయశక్తులా యత్నించసాగారు ఇంద్రుడు, చంపకాను. ఆ మిత్రుల తాపత్రయం, వారి ప్రేమాభిమానాలు చూసి చాటుగా కంటనీరు పెట్టుకునేవారు చంద్రుడి తల్లిదండ్రులు.

శాశ్వతంగా అవిటివాడయిన చంద్రుణ్ణి చూస్తూంటే చంపకలో కొత్త ఆలోచనలు రేగాయి. క్రూర వృత్తమూ,

మనిషి సాయమూ ఎంతైనా అవసరం అతనికి. కట్టుకున్న భార్యకు తప్ప ఎవరి కుంటుందా అక్కర! కాని, ఆ అవిటి మనిషిని మనువాడేందుకు ఏ యువతి ముందుకొస్తుంది?

తన మూలంగా ఆ స్థితికి వచ్చాడు చంద్రుడు. కనుక అతని బాధ్యతను వహించవలసిన విధి తనకుంది.... అని తలపోసింది చంపక. చంద్రుణ్ణి పెళ్లాడాలన్న నిర్ణయానికి వచ్చింది. ఇంద్రుడు సయితం ఆమె నిర్ణయానికి ఆనందంగా ఆమోదించాడు.

కాని– చంద్రుడు అందు కంగీకరించ లేదు. "చంపా! నువ్వింద్రుణ్ణి మనువాడబోతుండావన్న సత్యం నా కెరుకే. అందుకు నాకు అసూయ లేదు. నువ్విప్పుడు నా పైన జాలితో మనసు మార్చుకుండవనీ ఎరుగుదును. అది నేను సహించలేను. ఒద్దు చంపా! నా మీద జాలితో నీ బ్రతుకు బండలు చేసుకోవద్దు.... నీ ప్రేమాభిమానాలు ఇట్టా నిలిస్తే చాలు...." అన్నాడు కన్నీటితో.

"వుహుఁ నా కద్దు సెప్పొద్దు, చంద్రూ! జీవితాంతం నీ సేవచేసుకోక పోతే నా మదికి శాంతి లభించదు. అలాగైనా నీ రుణం తీర్చుకోనీ" అంది చంపక దుఃఖిస్తూ.

"రుణం కంటె, నీ స్వచ్ఛమైన ప్రేమ, స్నేహమే నా కెక్కువ, చంపా! నా పైన సానుభూతితో నన్ను మనువాడి నన్నవమానించకు" అన్నాడు చంద్రుడు.

"చంద్రూ! చంప మాట కాదనకురా. నీ మీద సానుభూతితో కాదు, మనస్ఫూర్తిగానే నిన్ను మనువాడుతా నంటోంది. దయచేసి కాదనకు" అంటూ ఇంద్రుడు ప్రాధేయపడ్డాడు.

"ఇంద్రూ! ఈ పేద మిత్రుడికోసం ఎందుకురా అంతటి త్యాగానికి పూనుకుంటున్నారు మీరు!"

"ఇది త్యాగం కాదు, చంద్రూ! స్నేహితులుగా మా ధర్మం" అన్నారు చంపక, ఇంద్రులు ఒకేసారి.

ఎన్ని విధాలుగా బోధించినా చంద్రుడు అంగీకరించలేదు. చంపక ఇంద్రుణ్ణి చేసుకోవలసిందేనని పట్టుపట్టాడు. అలాగైతే చంద్రుడితోపాటు తామిద్దరూ కూడా బ్రహ్మచారులుగా వుండిపోతామని బెదిరించాడు ఇంద్రుడు. అప్పటికీ చంద్రుణ్ణి వొప్పించటం వారి తరం కాలేదు. చంపకను వివాహమాడి తన చిన్ననాటి నెచ్చెలికి అన్యాయం చేయలేనని దృఢంగా చెప్పాడు అతను.

చివరకు, "చంద్రూ! పర్వతమ్మ తల్లంటే నీకు గురేగా! వచ్చే అమవాస్యకు ఆ తల్లి జాతర జరుగుతుంది. ఆ రోజు అ తల్లి సన్నిధిలో పరీక్ష పెడతాను అందులో పర్వతమ్మ తల్లి ఎవరిని నెగ్గిస్తే వారే నా భర్త!" అంది చంపక

"చంపా!" అన్నాడు చంద్రుడు కలవరంతో.

"ఇక మాట్లాడకు, చంద్రూ! చంప చెప్పిందే సబవు. మనువాడబోయేవాణ్ణి ఎన్నుకునే హక్కు కన్నెపిల్ల కుంది. కాదనడానికి మన మెవరం? తీర్పు పర్వ తమ్మకే వొదిలేద్దాం" అని ఇంద్రుడు కూడా అనడంతో, నోరెత్తలేకపోయాడు చంద్రుడు.

## 4

ఏటా అషాఢమాసపు అమావాస్య నాడు గ్రామదేవత పర్వతమ్మ తల్లి జాతర జరుగుతుంది ఆ గూడెంలో. ఎంతో వుత్సాహంతో, భక్తిప్రపత్తులతో పెద్ద వుత్సవం చేసుకుంటారు ఆ గూడెంవాళ్లు. ఆ రోజున కన్నెపిల్లలు తమ భర్తలను ఎన్నుకోవడం ఆచారంగా వస్తోంది. యువతులు దానిమ్మపండు కోసి అందులో తమ వ్రేలి వుంగరం వుంచి ఆ పండును పూలతో బంతిలా అందంగా కట్టి కోరుకున్న యువకుడికి ఇవ్వడం ఆచారం. ఆ యువకుడు ఆ పండు స్వీకరించి అందులోని వుంగరం తీసి వ్రేలికి పెట్టుకుని, పండు తిన్నట్లయితే ఆ యువతిని మనువాడడానికి అంగీకరించినట్లు చిహ్నం. అలా కాక పండును నిరాకరించినట్లయితే అసమ్మతికి గుర్తది. అటువంటి యువతులు తమ ఫలాలను పర్వతమ్మ విగ్రహం ముందు విడిచి వస్తారు. తరువాత మనువాడదలుచుకున్న యువకులు కొందరు వెళ్లి ఎవరికి తోచిన ఫలాన్ని వారు తీసుకోవడం జరుగుతుంది. వాటిలోని అంగుళీయం ఏ యువతికి చెందితే ఆ యువతిని పెళ్లాడాలి వాళ్లు. ఆ విధంగా ఏడాది కొకసారి గూడెంలోని యువతీ యువకుల వివాహాలు నిర్ణయించబడతాయి.


చంపక రెండు దానిమ్మపళ్లను తయారుచేసింది. రెంటినీ పూలతో అందంగా తయారుచేసింది. ఒకదాని కొకటి భేదంలేకుండా రెండూ ఒకేలా వున్నాయి.

జాతర రోజున ఇంద్రుడు, చంపకల సాయంతో, కర్రను వూతంగా చేసుకుని కుంటుకుంటూ పర్వతమ్మతల్లి గుడికి బయలుదేరాడు చంద్రుడు. ఆ తల్లికి మనసారా మొక్కి, జనానికి ఎడంగా ఒకచోట కూర్చున్నారు ముగ్గురూ.

దానిమ్మపళ్లను వారి ముందుంచింది చంపక.

"చంద్రూ! ఈ రెంటిలో ఒకదానిలో వుంగరం వుంది. ఇద్దరూ చెరో పండూ తీసుకోండి. ఉంగరం ఎవరికి వస్తే వారు ఎటువంటి అభ్యంతరమూ చెప్పకుండా నన్ను మనువాడాలి" అంది.

చంద్రుడు తటపటాయించాడు. "చంపా! ఇది అవసరమంటావా? నువ్వు ఇంద్రుణ్ణి మనువాడడమే సబబు...." అంటూన్న అతన్ని వారిస్తూ అంది చంపక— "నా కేది మేలో ఆ పర్వతమ్మ తల్లినే నిర్ణయించనీ, చంద్రూ!"



అప్పటికీ చంద్రుడికి చేతులు రాలేదు పండు అందుకోవడానికి.

"చంప లెస్సగ పలికింది, చంద్రూ! మరిక యోచన వీడి పండందుకో" అన్నాడు ఇంద్రుడు.

"ముందుగా నువ్వే తీసుకోరా" అని చంద్రుడంటే, "కాదు, నువ్వే తీసుకోవాల" అని ఇంద్రుడు వాదించాడు. చంపక కూడా తననే ముందుగా తీసుకోమనేసరికి నిస్సహాయుడయ్యాడు చంద్రుడు. మిత్రుల అనురాగానికి అతని కన్నులు చెమర్చాయి. వారి సానుభూతికి మనసులో కలుక్కుమనక పోలేదు.

నిర్లిప్తంగా ఒక పండందుకున్నాడు చంద్రుడు. రెండో పండు ఇంద్రుడందుకున్నాడు.

వారి కెదురుగా కూర్చున్న చంపక మౌనంగా మోకాళ్ల మధ్య తల వాల్చుకుంది.

రెండు నిముషాల తరువాత, "నా పండులో ఉంగరం లేదు" అన్నాడు చంద్రుడు.

ఉలిక్కిపడి తలెత్తింది చంపక. కళ్ళల్లోకి సూటిగా చూస్తూ "సరిగా చూసావా, చంద్రూ?" అంది.

"చూసాను" అంటూ దానిమ్మ పండును జేబులో పడేసుకున్నాడు చంద్రుడు. "నాకు తెలుసు, పర్వతమ్మ తల్లి నీవంటి అమాయకురాలికి అన్యాయం చెయ్యదు."

"ఉంగరం నా పండులో ఉంది!" అంటూ తీసి చూపించాడు ఇంద్రుడు.

అయోమయంగా చూసింది చంపక.

చంద్రుడు అనందంతో, "చూసావా? ఇంద్రుడే నీ మగడు!" అన్నాడు.

"చంద్రూ! ఇప్పటికైనా మించిపోయింది లేదు. మే మిద్దరమూ మన స్ఫూర్తిగా అర్థిస్తున్నాం. చంపను నువ్వు మనువాడరా" అన్నాడు ఇంద్రుడు ప్రాధేయపూర్వకంగా. ఆ సంఘటన మిత్రుణ్ణి మరింత క్రుంగదీస్తుందని ఇంద్రుడెరుగును. అందుకే ఎలాగైనా అతన్ని వొప్పించాలన్న తాపత్రయం.

కాని, "అపచారం! పర్వతమ్మ తల్లి నిర్ణయాన్ని కాదనే శక్తి మనకు లేదు .... చంపను మనువాడి సుఖపెట్టు. అదే నా కానందం" అని చంద్రుడు తన దృఢనిశ్చయాన్ని మరోమారు వ్యక్తం చేయడంతో నోరెత్తలేకపోయా రెవరూ.

చంపక కన్నుల్లో నీళ్లు నిలిచాయి.

"ఏడుస్తున్నావా, చంపా? ఈ అభాగ్యుడిపైన నీ కెందుకంత అభిమానం? .... మీ ఇద్దరి ప్రేమాభిమానాలే నాకు వూపిరి.... చింతించకు, చంపా! ఈ సంతోష సమయంలో కంటతడి పెట్టకూడదు" అంటూ కొనగోట ఆమె కన్నీటిని తుడిచాడు.

వారి సాయంతో లేచి నిలుచున్నాడతను.

ఇంద్రుడు, చంపకల చేతులను తన చేతులతో కలిపి అప్యాయంగా వారివంక చూసాడు. ముగ్గురి కళ్ళలోనూ ముత్యాల్లా నీరు!

తరువాత ఆ జంట నక్కడే విడిచి, బరువెక్కిన హృదయంతో నెమ్మదిగా కర్రతో కుంటుకుంటూ భారంగా ఇంటి దారి పట్టాడు.

కన్నీరు కళ్ళకు తెరలు కప్పుతుంటే ఆర్ద్రమైన హృదయంతో జాలిగా అతని వంకే చూస్తూ వుండిపోయారు ఇంద్రుడు, చంపకాను.

కొంతదూరం వెళ్లాక అగి, ఆ జంట వంక చూసాడు చంద్రుడు.




తనవంకే చూస్తూన్న ఆ జంట వైపు కన్నీటితో చేయి వూపాడు.

తిరిగి చేతులు వూపారు వాళ్లు.

ముందుకు కదలబోతూ ఆగాడు చంద్రుడు. జేబులో నుండి దానిమ్మపండు పైకి తీసాడు. అందులో వున్న చంపక వుంగిరాన్ని తీసి ప్రేమతో ముద్దు పెట్టుకున్నాడు.

'నీ మనసు నా కర్థమైంది, చంపా। నీ శ్రేయస్సుకోరే మంచి మిత్రుడిగా నీ కన్యాయం చేయలేను.... నీ ఈ చిహ్నాన్ని చూసుకుంటూ నా శేషజీవితాన్ని గడుపేస్తాను' అని తనలో తానే గొణుక్కుంటూ వుంగరాన్ని జేబులో భద్రంగా దాచుకుని, కుంటుకుంటూ భారంగా ముందుకు కదిలాడు చంద్రుడు.